క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే విజయీభవ యాత్ర

చేజర్ల: మండలంలోని వావిలేరు సచివాలయ పరిధిలోని మైపాటివారికండ్రిక, వావిలేరు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజరు కరీమున్నీసా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారుల బృందం పాల్గొంటారన్నారు. ఆత్మకూరు ప్రాంత ప్రయాణికులు, ప్రజలు తమ విలువైన సూచనలు, సలహాలను, ఫిర్యాదులను సెల్ 99592 25645లో సంప్రదించి తెలియజేయాలని కోరారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.వైజయంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 40 సీట్లు ఖాళీలున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు https:// apkgbv. apcfs. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9491463446 నంబరులో సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్ చేయూత నేడు

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఏపీఎం బి.వెంకమ్మ సోమవారం తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలు పరిధిలో చేయూత లబ్ధిదారులతో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. చేయూత లబ్ధిదారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బీఎస్ఎఫ్ దళాల రాక

ఆత్మకూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ దళాలు ఆత్మకూరుకు వచ్చినట్లు పోలీస్ అధికారులు సోమవారం తెలిపారు. 84 మంది బీఎస్ఎఫ్ మెన్‌లు ఉన్న మూడు దళాలు ఆత్మకూరు నియోజకవర్గ ఎన్నికల్లో భద్రతా విధులు నిర్వహించేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రశాంతంగా నిర్భయంగా ఓటు పోల్ చేసుకోవచ్చునని తెలిపారు. వీరికి ఎస్సీ బాలుర హాస్టల్‌లో వసతి ఏర్పాటు చేశారు.


నేడు కలిగిరిలో వలంటీర్లకు వందనం

కలిగిరి: కలిగిరిలోని ఆవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం జరుగుతుందని జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పోలింగ్‌బూత్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారని, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఏపీఎం బాధ్యతల స్వీకరణ

కొండాపురం: వైఎస్సార్ క్రాంతి పథం ఇన్‌చార్జి ఏపీఎంగా కోవూరు ఏపీఎం ఎం.కృష్ణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొండాపురంలో సీసీగా పనిచేస్తున్న మనోహర్ ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఏపీఎంగా వ్యవహరించారు. ఇన్‌చార్జి ఏపీఎం కృష్ణయ్య మాట్లాడుతూ పొదుపు మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను సకాలంలో అందేలా చూస్తానన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్ గుర్తు తెలియని వ్యక్తి (45) వ్యక్తి అనారోగ్యంతో పడి ఉండటాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. 108 సిబ్బంది అతన్ని సంగం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఫ్యాంట్, షర్ట్ ధరించి ఉన్నాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊరు బాగుపడింది.. జీవనం మారింది

ఆ ఊరికి కొత్తగా సిమెంట్ రోడ్లు వచ్చాయి. సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఆర్బీకే వంటి అత్యాధునిక వసతులతో ప్రభుత్వ భవనాలు ఆ ఊరికే ఐకాన్‌గా నిలుస్తున్నాయి. పాడుబడిన బడులు ఆహ్లాదకరంగా మారాయి. చింపిరి దుస్తులతో బడికి వెళ్లే పేదంటి బిడ్డలు యూనిఫాం, బూట్లు, టై ధరించి బ్యాగులతో బడికి వెళ్లే పిల్లలను చూస్తుంటే ఎంత మార్పొచ్చిందని చెప్పుకుంటు పరిస్థితి వచ్చింది. మరో వైపు ఊరు ప్రజలు గడప దాటకుండానే ప్రభుత్వ సేవలను పొందుతుంటే.. మరో వైపు సంక్షేమ పథకాలతో పేద, దిగువ మధ్య తరగతి ప్రజల జీవన శైలి మారింది.



గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డు

- సంక్షేమం, అభివృద్ధికి రూ.13.89 కోట్ల వెచ్చింపు

సోమశిల: అనంతరసాగరం మండలంలోని ఉప్పలపాడు పంచాయతీ ఒకప్పటి వరకు మారుమూల గ్రామంగానే ఉండేది. ఇక్కడి జనమంతా రైతువారీ జీవనాధరంతో బతుకుతున్నారు. అరకొరగా పండే పంటలతో పాటు పాడిపై వచ్చే ఆదాయంతో అంతంత మాత్రంగా బతికే ఆ కుటుంబాల్లో పెనుమార్పులు వచ్చాయి. వీరి కష్టానికి ప్రతిఫలం దక్కడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధిలో మెట్టు మెట్టు ఎక్కుతూ ఎగబాకుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ పంచాయతీ అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. గతంలో మండల కేంద్రానికి పరిమితమైన అధికారిక వ్యవస్థలను గ్రామీణ ప్రాంతాలకు తెచ్చే విధంగా ఏర్పాటు చేసిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయడంతో ఆ ఊరులో పట్టణీకరణ సొబగులు అద్దుకుంది. గతంలో మౌలిక సదుపాయాలు కూడా లేక స్థానికులు అవస్థలు పడుతుంటే.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.20 లక్షల అభివృద్ధి నిధులు అందజేయడంతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఎంపీ నిధుల ద్వారా గ్రామంలో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు నిర్వహించారు.

1,835 మందికి రూ.8.153 కోట్ల లబ్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ, నాన్‌డీబీటి పథకాల కింద 1,835 మంది లబ్ధిదారులకు రూ.8.153 కోట్లను అందజేశారు. జగనన్న లే అవుట్‌లో 26 మంది లబ్ధిదారులకు రూ.46.8 లక్షలు, సొంత స్థలం కలిగిన వారికి రూ.14.4 లక్షలను ప్రభుత్వం మంజూరు చేయడంతో గృహ నిర్మాణాలు సైతం ప్రారంభమయ్యాయి. చుక్కల భూములు, సర్వీస్ ఇనాం, అసైన్‌మెంట్, తదితర భూ సమస్యల పరిష్కారం కావడం ద్వారా 73 మంది రైతులకు సుమారు 84 ఎకరాల్లో భూ సమస్యలు పరిష్కారం లభించింది. ఇలా పంచాయతీలో ప్రజలు అభివృద్ధి దిశగా, ప్రతి కుటుంబం ఆర్థిక ప్రగతి దిశగా అడుగులు వేస్తోంది.



రైతులకు సేవలందిస్తున్న ఆర్బీకే

గ్రామం అభివృద్ధి చెందింది



మా గ్రామంలో నూతనంగా సిమెంట్ రోడ్లు, ప్రభుత్వ శాశ్వత భవనాలైన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో పాటు మౌలిక వసతులు ఏర్పాటు చేస్తుండడంతో మా గ్రామం ఎంతగానో అభివృద్ధి చెందింది. చాలా సంతోషంగా ఉంది. మా కళ్ల ముందే ఇంత అభివృద్ధి కనిపిస్తోంది.

– శ్రీనివాసులరెడ్డి, ఉప్పలపాడు

అందుబాటులో వైద్య సేవలు



మా ఊరిలోనే వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పెట్టారు. స్థానికంగానే వైద్యసేవలు అందుతున్నాయి. గతంలో ఏ చిన్న సమస్య వచ్చినా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. వైద్యసేవలు అందుబాటులోకి రావడంతో సమస్య తీరింది. మాలాంటి పేదలకు మందులకు ఖర్చు కూడా తగ్గింది.

– షేక్ ఫకీర్ బీ, ఉప్పలపాడు

ఐదేళ్లలో వివిధ పథకాల ద్వారా ఉప్పలపాడు ప్రజలకు చేకూరిన లబ్ధి		
పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.ల్లో)
జగనన్న అమ్మఒడి	195	89,61,994
జగనన్న విద్యాదీవెన	125	44,75,907
జగనన్న వసతిదీవెన	94	14,91,452
వైఎస్సార్ రైతు భరోసా	366	1,78,63,000
సున్నా వడ్డీ పంట రుణాలు	15	28,416
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	157	13,61,030
వైఎస్సార్ పింఛన్ కానుక	408	4,16,00,750
వైఎస్సార్ చేయూత	117	55,12,500
వైఎస్సార్ ఆసరా	349	98,26,618
వైఎస్సార్ సున్నావడ్డీ	437	16,87,073
వైఎస్సార్ కాపు నేస్తం	1	60,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	89	42,43,034
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	51	3,52,350
వైఎస్సార్ బీమా	11	11,80,000
వైఎస్సార్ వాహనమిత్ర	9	2,90,000
జగనన్న తోడు	29	7,10,000
కోవిడ్ సహాయం	582	5,82,000
జగనన్న తోడు (వడ్డీ)	57	32,602
జగనన్న విద్యాకానుక	118	8,38,036
జగన్ననతోడు(రుణాలు)	73	13,59,187
జగనన్న గోరుముద్ద	125	12,38,375
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	557	1,21,67,108
వైఎస్సార్ కంటి వెలుగు	148	27,72,040



ఉప్పలపాడులో నూతనంగా నిర్మించిన సచివాలయం

ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే 'లక్పతి దీదీ' లక్ష్యం

ఉదయగిరి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలను దృష్టిలో ఉంచుకుని వారు ఆర్థిక పరిపుష్టి సాధించేలా ప్రవేశ పెట్టిన 'లక్పతి దీదీ' పథకం ద్వారా ప్రతి మహిళను రెండేళ్లలో లక్షాధికారిని చేయడమే లక్ష్యమని ఏపీఎం ఖాజారంతుల్లా తెలిపారు. ఆయన సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపిక చేసిన పొదుపు మహిళలు, వీఓఏలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. 'లక్పతి దీదీ' పథకం కింద 70 మంది మహిళలను ఎంపిక చేశామన్నారు. వారికి రెండేళ్లలో బ్యాంకుల ద్వారా వివిధ రకాల రుణాలు మంజూరు చేయించి వారు నెలకు రూ.10 వేలు ఆదాయం పొందుతూ లక్షాధికారిణిగా చేయాల్సి ఉందన్నారు. పథకంలో వీఓఏలు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు, పొదుపు సంఘ కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏపీఎం, తదితరులు

'స్పందన' సమస్యలకు వెంటనే పరిష్కారం

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమం ద్వారా ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో అందే అర్జీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ కె మధులత తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 7 అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లకు, రెవెన్యూ సిబ్బందికి స్పందన అర్జీలను పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించామన్నారు. కాగా పలు భూ సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి సంబంధిత తహశీల్దార్లకు వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ, డీటీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అయోడిన్ లోపం వ్యాధులపై అవగాహన

కలిగిరి: కలిగిరి జెడ్పీ హైస్కూల్, మెయిన్ ప్రాథమిక పాఠశాలల్లో అయోడిన్ లోపంతో వచ్చే వ్యాధులను గుర్తించడానికి విద్యార్థుల నుంచి సోమవారం అవగాహన కల్పించారు. విద్యార్థుల నుంచి నమూనాలు సేకరించారు. వైద్యాధికారిణి గీతారెడ్డి మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 6వ తగరతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో అయోడిన్ లోపాలు గుర్తిస్తున్నామన్నారు. అందులో భాగంగా పిల్లల నుంచి ర్యాండమ్‌గా యూరిన్ శాంపిల్, వారి ఇళ్లలో వాడుతున్న సాల్ట్‌ల శాంపిల్స్‌ను సేకరించి నెల్లూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపుతున్నామన్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ సక్కుబాయమ్మ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కలిగిరిలో విద్యార్థులకు పరీక్షలు జరుపుతున్న వైద్యాధికారిణి గీతారెడ్డి

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ఉదయగిరి: పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి వినీత సోమవారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నియంత్రణ దినోత్సవం సందర్భంగా బాల బాలికల్లో అయోడిన్ లోపాన్ని గుర్తించడం జరుగుతుందన్నారు. వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అయోడిన్ తగిన మోతాదులో ఉండాలన్నారు. అనంతరం పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

అనుమసముద్రంపేట: మండలంలోని గుడిపాడు సచివాలయం పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్, డాక్టర్ మంజులమ్మ ఆధ్వర్యంలో 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు అయోడిన్ లోపంపై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 18 మంది విద్యార్థులకు సాల్ట్ పరీక్షలు, 9 మంది పిల్లలకు యూరిన్ పరీక్షలు నిర్వహించి జిల్లా ల్యాబ్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ చిన్నయ్య, ఎంపీహెచ్ఎస్ రషీద్, ఎంఎన్‌హెచ్‌పీ విహారి, ఏఎన్ఎం మంజులమ్మ, హెల్త్ అసిస్టెంట్ రవూఫ్, ఆశలు, ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చిత్తలూరు పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ వేసవి కాలంలో వృద్ధులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలన్నారు. చల్లటి నీరు, మజ్జిగ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 40 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అనంతరం ఆదూరుపల్లి హైస్కూల్, నెర్నూరు పాఠశాలల్లో విద్యార్థులకు అయోడిన్ లోప పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విమలకుమారి, మంజుల, నీరజ, జబీనా, లక్ష్మమ్మ, కుమారి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవం నేడు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి జెండా ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ, పట్టణ, రూరల్ కన్వీనర్లతో పాటు అన్ని వార్డుల కన్వీనర్లు, పార్టీ బాధ్యులు, వివిధ సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లు, కార్యకర్తలు, ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

దరఖాస్తులకు ఆహ్వానం

మర్రిపాడు: మర్రిపాడు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సీహెచ్ లక్ష్మీదేవి సోమవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్ గ్రూపులో మొదటి సంవత్సరం కోర్సుల్లో 40 సీట్లు ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అనాథ, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగవన జీవిస్తున్న బాలికలు మాత్రమే చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే సమీప కేజీబీవీ ప్రిన్సిపల్ 9000850953 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



సురేంద్రరెడ్డి మృతదేహం

కావలి: సహచరులు నింద వేశారని అవమానభారంతో ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి సోమవారం మృతి చెందాడు. కావలి రెండో పట్టణ సీఐ సమాచారం మేరకు.. కావలి పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కోటా సురేంద్రరెడ్డి (29) కావలి పట్టణ విశ్వహిందుపరిషత్ సహ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. వీహెచ్‌పీ నిధుల సమీకరణ కోసం కావలి ఏరియా వైద్యశాలలో ఆ సంస్థ ఇటీవల హుండీని ఏర్పాటు చేసింది. అయితే ఈ హుండీని సురేంద్రరెడ్డి పగులగొట్టి అందులో వచ్చిన డబ్బులు కాజేశాడని సంస్థలో పని చేస్తున్న పర్రె కోటేశ్వరరావు, సుబ్బరాయుడు అనే వారు నిందవేశారు. దీన్ని తీవ్ర అవమానంగా భావించిన సురేంద్రరెడ్డి ఈ నెల 8న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ మేరకు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పాటు మృతుడిచ్చిన మరణ వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన ముస్లిం యువతకు కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని 2, 3, 10, 40 వార్డులకు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు, ముస్లిం యువత భారీ సంఖ్యలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా భారీ బైక్ ర్యాలీతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ముస్లిం యువత మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింలకు జగన్ ప్రభుత్వమే అండగా నిలిచిందని స్పష్టం చేశారు. టీడీపీ హయాంలో ఒక్క ముస్లిం కూడా మంత్రిగా లేరని గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సాధికారత దిశగా ముస్లింలకు పెద్దపీట వేశారన్నారు. జిల్లాలో తొలి సారిగా అజీజ్‌ను నెల్లూరు మేయర్‌గా చేసింది కూడా జగన్‌మోహన్‌రెడ్డే అనే విషయాన్ని ప్రతి ముస్లిం గుర్తించాలన్నారు. తొలి సారిగా జిల్లా నుంచి ముస్లింకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన ఘనత కూడా జగన్‌కే దక్కుతుందన్నారు. జిల్లాలో ముస్లింకు సీటు ఇచ్చేందుకు ఆ పార్టీ కీలక నేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బెదిరింపులు కూడా లెక్క చేయకుండా ముస్లింలకే టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. జిల్లాలోని ముస్లింలు అందరూ వైఎస్సార్‌సీపీకే ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అల్తాద్, మున్నా, నాయబ్, కన్నా, మాబాషా, తదితరులు పాల్గొన్నారు.

కావ్య.. నోరు అదుపులో పెట్టుకో

- పసుపులేటి కుటుంబం హెచ్చరిక

కావలి: నియోజకవర్గంలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధపడిన పసుపులేటి సుధాకర్‌కు వచ్చిన జనం తనకు రావడం లేదని మతిభ్రమించి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని సుధాకర్ సోదరుడు వెంకటేశ్వర్లు, ఆయన సతీమణి సుగుణమ్మ మండిపడ్డారు. కావలిలోని పీఎస్ఆర్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో వెంకటేశ్వర్లు మాట్లాడారు. టీడీపీని వీడి సుధాకర్ వెంట ప్రజలు నడుస్తుంటే కావ్య దిక్కుతోచని స్థితిలో మతిలేని మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. నోరు అదుపులో పెట్టుకుని వ్యవహరించకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. బీసీల బాగు కోసం తన సోదరుడు స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తుంటే చూసి ఓర్వలేక, వైఎస్సార్‌సీపీ నిలబెట్టిన అభ్యర్థిగా దుష్ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. కావ్య కృష్ణారెడ్డే గతంలో వైఎస్సార్‌సీపీకి ఓట్లేయమని ప్రచారం చేసిన విషయం గుర్తు తెచ్చుకోవాలన్నారు. తన సోదరుడు సేవా దృక్పథంతో నియోజకవర్గ ప్రజల కోసం రూ.కోట్లు ఖర్చు పెట్టారని, కావ్య కృష్ణారెడ్డి పైసా కూడా ప్రజల కోసం ఖర్చు పెట్టలేదని విమర్శించారు. కోవిడ్ సమయం నుంచి తమ కుటుంబం ప్రజల్లోనే ఉందని, ప్రజల కోసం హైదరాబాద్‌లో సంపాదించిన డబ్బు ఇక్కడ ఖర్చు పెడుతున్నారని వివరించారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సుధాకర్ ఆశయాలకు ఆకర్షితమవుతున్న అన్నీ వర్గాల ప్రజలు తమ వెంట నడుస్తుంటే కావ్య ఓర్చుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే కావ్యకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సుధాకర్ సోదరుడు వెంకటేశ్వర్లు

బైక్‌ను ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు

వరికుంటపాడు: వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగింది. వరికుంటపాడుకు చెందిన బిరుదురాజు సుబ్బరాజు, కాకి హరి బైక్‌పై ఎస్సీ కాలనీ నుంచి ఊర్లోకి వెళ్లేందుకు జాతీయ రహదారిపై వెళ్తుండగా ప్రకాశం జిల్లా పామూరు నుంచి దుత్తలూరు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో సుబ్బరాజు, హరి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై తిరుపతయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను చికిత్స నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఉదయగిరికి అక్కడి నుంచి ఆత్మకూరుకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

